

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

8 పేజీలు | మంగళవారం | అక్టోబర్ 31, 2023 | www.navatelangana.com



గెలిపించడమైనా..ఓడించడమైనా నేతకానీలతోనే..!

- చెన్నూర్ టికెట్ ఆశిస్తూ నిరాహార దీక్షకు కూర్చున్న నేతకాని కులస్తులు

2లో...



సమిష్టిగా కృషి చేస్తే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం

- జన్నారంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్

7లో...

నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణ సజావుగా చేపట్టాలి

- ఎన్నికల సీనియర్ డిప్యూటీ కమిషనర్ నితేష్ వ్యాస్
- జిల్లాలో ఓటర్లకనుగుణంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ బోర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎన్నికల సీనియర్ డిప్యూటీ కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. సోమవారం న్యూఢిల్లీ నుండి వీడియో

మిగతా..2లో...

దక్కని గిట్టుబాటు..!

ధర..తేమ శాతాన్ని పెంచాలని రైతుల డిమాండ్

- తొలిరోజే పత్తి రైతులకు తీవ్ర నిరాశ
- మద్దతు ధర కంటే కేవలం రూ.80అధికం
- మార్కెట్‌లో ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు



వ్యాపారస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ అర్బన్

మార్కెట్‌లో పత్తి రైతులకు తొలి రోజే తీవ్ర నిరాశ ఎదురైంది. ప్రభుత్వ మద్దతు ధర కంటే అధికంగా గిట్టుబాటు ధర లభిస్తుందని భావించిన అన్నదాతలకు ఆశాభంగం ఎదురైంది. క్వింటాల్‌కు ప్రయివేటు వ్యాపారులు మద్దతు ధర కంటే కేవలం రూ.80 మాత్రమే అధికంగా చెల్లించేందుకు ముందుకుపోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తాము పెట్టిన పెట్టుబడికి ఈ ధర ఏ మాత్రం గిట్టుబాటు కాదని పెదవి విరుస్తున్నారు. మరోపక్క తొలి పత్తి కావడంతో తేమశాతం కూడా అధికంగా ఉంటుంది. ప్రభుత్వం మాత్రం కేవలం 8శాతమే మినహాయింపు ఇవ్వడం.. మార్కెట్‌కు వచ్చిన పత్తిలో అధికంగా చూపించడంతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. తాజాగా గిట్టుబాటు ధర పెంచడంతో పాటు తేమశాతాన్ని కూడా కనీసం16 వరకు పెంచాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

వివరాలు..2లో...

మళ్లీ మొదలైన ఎన్‌హెచ్-63 సర్వే..!

- గతంలో అడ్డుకున్న బాధితులు
- ఎన్నికల కోడ్ అడ్డంపెట్టుకొని సర్వే ఏజెన్సీ దూకుడు
- అభివృద్ధి కోసం అన్నీ త్యాగం చేస్తున్నాం : గుడిపేట్ గ్రామస్తుల ఆవేదన
- గతంలో ఎల్లంపల్లి, ఇప్పుడు రహదారి విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న వైనం
- అభివృద్ధి పేరిట రెండు సార్లు నిర్వాసితులుగా మారుతున్న గుడిపేట్ గ్రామస్తులు
- రోడ్డు విస్తరణలో ఉపాధి కోల్పోతున్న వందల మంది
- న్యాయమైన పరిహారం కోసం పోరాటం

నూతనంగా నిర్మిస్తున్న నాలుగు వరుసల(ఎన్‌హెచ్-63) రహదారిలో రోడ్డుని ఆనుకొని ఉన్న వేలాది గృహాలు, భూములు కోల్పోవాల్సి వస్తోంది. జిల్లాలోని రాయపట్నం బ్రిడ్జి నుండి క్యాతన్‌పల్లి ఎన్‌హెచ్ 363కి అనుసంధానం చేసే వరకు సుమారు 36కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి సర్వే చేశారు. దీన్ని గత వేసవిలో బాధితులు అడ్డుకున్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి విన్నవించారు. నాలుగు నెలలుగా సర్వే ఆగిపోయింది. ఇప్పుడు ఎన్నికల కోడ్‌తో బాధితులు ఆందోళన అవకాశం లేనందున సర్వే ఏజెన్సీ దూకుడు పెంచింది. ఇటీవల అంకతిపల్లె వద్ద సర్వే జరిపారు. అయితే ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంలో ఇండ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులు రహదారి పక్కన భూములు కొనుగోలు చేసి ఇండ్లు నిర్మించుకొని ఉపాధి కోసం దుకాణాలు ఏర్పాటు చేసున్నారు. ఇప్పుడు రోడ్డు విస్తరణలో ఆ ఇండ్లు కొల్పోనుండడంతో ఆవేదన చెందుతున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసమని ఒక వైపే భూసేకరణ చేయనున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ గతంలో నోటిఫికేషన్ విడుదల చేయడంతో బాధితులు న్యాయం కోసం సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగి సర్వేను అడ్డుకున్నారు.



అంకతిపల్లె వద్ద సర్వే చేస్తున్న సర్వే ఏజెన్సీ సిబ్బంది

నవతెలంగాణ - హాజీపూర్

దేశ అభివృద్ధి కోసం రోడ్ల నిర్మాణం చేస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ ఆ రోడ్ల నిర్మాణం కోసం ఎందరో త్యాగం చేయనిదే నిర్మాణం జరగడం లేదు. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో ఎన్‌హెచ్-63ను నాలుగు వరుసల రహదారిగా ఏర్పాటు చేసే పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే మార్చ్ 28న జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ రోడ్డు నిర్మాణం జిల్లాలోని రాయపట్నం బ్రిడ్జి గూడెం నుండి క్యాతన్‌పల్లి వరకు 36 కిలోమీటర్ల మేర భూ సేకరణ కోసం సర్వే చేపట్టనున్నారు. భూసేకరణలో రోడ్డు పక్కన ఇండ్ల నిర్మాణం చేసుకున్న వారు కొందరు వారి ఇండ్లను పూర్తిగా కోల్పోనున్నారు. ఎన్‌హెచ్ఎఐ గతంలో రోడ్డు నిర్మాణంపై ఒక మ్యాప్‌ను కూడా విడుదల చేసింది. ఇందులో ఒక్కో ప్రదేశంలో పూర్తి స్థాయిలో ఇండ్లు కోల్పోనున్నట్లు తెలుస్తోంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్న చోట రోడ్డును ఒకే వైపు మళ్లించారు. దీంతో గతంలో రోడ్డు పక్కన 75 ఫీట్ల దూరంలో ఇండ్లు నిర్మించుకున్న వారు కూడా పూర్తిగా ఇండ్లు కోల్పోవాల్సి వస్తుంది. ఒక్కో దగ్గర ఒక వైపే వంద ఫీట్ల వరకు భూసేకరణ చేయనున్నట్లు మ్యాప్‌లో పొందుపర్చారు. దీంతో ముందు జాగ్రత్తగా రోడ్డుకు ఆర్అండ్‌బీ లెక్కల ప్రకారమే ఇల్లు నిర్మించుకున్న వారు కూడా నష్టపోవాల్సి వస్తుంది. ఈ విషయమై బాధితులు గతంలో పెద్ద ఎత్తున పోరాటం చేశారు. కేంద్రం మంత్రిని కూడా కలిసి రోడ్డుకు రెండు వైపులా సర్వే చేయాలని, ఎంత పరిహారం ఇస్తారో తెలిపిన తర్వాతే తమ ఇండ్లు, భూముల్లో సర్వే చేయాలని

మిగతా..2లో...

గెలిపించడమైనా..ఓడించడమైనా నేతకానీలతోనే...!

నవతెలంగాణ-జైపూర్

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో గల అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యధిక జనాభా కలిగిన నేతకాని కులస్థులకు రాజకీయంగా గుర్తింపు లేకుండా పోతుందని నేతకాని మహర్ కుల హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గం టికెట్ నేతకాని కులస్తులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలో నిరాహార దీక్ష చేపట్టారు. స్వాంతంత్రం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు ఇతర కులస్తులకు తప్ప నేతకాని సామాజిక వర్గానికి రాజకీయంగా ఏ ఒక్క పార్టీ గుర్తింపు ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో అభ్యర్థులను గెలిపించడమైనా..ఓడించడమైనా అత్యధిక జనాభా కలిగిన నేతకాని కులస్తులతోనే సాధ్యమని హెచ్చరించారు. భారత రాజ్యాంగంలో పొందిపర్చినట్లుగా జనాభా ప్రాతిపదికన కుల సామాజిక వర్గాలకు రాజకీయంగా గుర్తింపు లభించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఇప్పటికైనా నేతకాని సామాజిక వర్గాన్ని గుర్తించాలని, కాంగ్రెస్ పార్టీ నుండి నేతకాని కులానికి చెందిన గోమాస శ్రీనివాస్‌కు టికెట్ కెటాయిస్తే 60వేల మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. నేతకానీల హెచ్చరికలు లెక్కచేయకుండా ఇతరులకు టికెట్ కేటాయిస్తే ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాగిడి అర్జున్, కోట రాజం, కోట శ్రీరాములు, వనపర్త మాధవ్, చదువుల రాజం, జుమ్మిడి రాములు, సెగ్యం సంతోష్, ముడిమడుగుల శ్రీనివాస్, దుర్గం లింగన్న, సెగ్యం సంతోష్, కామెర అనూష, జుమ్మిడి లక్ష్మీ, జనగామ మంగ పాల్గొన్నారు.

ఆర్‌కే ఓసీపీలో భద్రత పక్షోత్సవాలు



రామకృష్ణాపూర్: ఆర్‌కె ఓసిపిలో సోమవారం 54వ భద్రత పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ కమిటీ కన్వీనర్ బి.హెచ్ వెంకటేశ్వరరావు(జిఎంహెచ్ఆర్టి), మందమర్రి జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని కోరారు. ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో అతి తక్కువ ప్రమాదాలు నమోదయ్యాయని, దీనికి కృషిచేసిన సేఫ్టీ జిఎం కార్పొరేట్ గురువయ్యకు అభినందనలు తెలిపారు. కార్మికులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేసిన రక్షణ పరికరాలను, పనిముట్లను వాడాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని పేర్కొన్నారు. భద్రత మన ఇంటి నుండి మొదలు కావాలని తెలిపారు. అనంతరం 53వ వార్షిక భద్రత వారోత్సవాలలో గెలుపొందిన కార్మికులకు బహుమతులను అందజేశారు. ద్విచక్ర వాహనాలపై, పని స్థలాలలో హెల్మెట్ ధరించడం వల్ల జరిగే ఉపయోగాలను, నిర్లక్ష్యం చేస్తే జరిగే పరిణామాలను వివరిస్తూ ప్రదర్శించిన లఘునాటిక అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్‌కె ఓసిపి ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, ప్రాజెక్ట్ మేనేజర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, సేఫ్టీ కమిటీ మెంబర్లు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణ సజావుగా చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేపట్టాలని, నామినేషన్లను పూర్తిగా పరిశీలించి పొరపాట్లు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అభ్యర్థులకు లిఖితపూర్వకంగా సమాచారం అందించాలని తెలిపారు. ఓటరు నమోదు కొరకు వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని, ఓటర్లకు ఎన్నికల కంటే వారం రోజుల ముందే ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని, ఎన్నికల నిర్వహణకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను నియోజకవర్గాలకు కేటాయించాలని, పోలింగ్ రోజున అదనపు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన ప్రతి పోలింగ్ కేంద్రంలో సౌకర్యాల కల్పనపై సెక్టార్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. కలెక్టరేట్ గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఎస్పీ సురేష్ కుమార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో 597 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ కొరకు రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. పోలింగ్ సిబ్బంది నియామకం, ఎన్నికల సామాగ్రి పంపిణీ, సర్వీస్ ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్ల కొరకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తున్నామని, ఎన్నికల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన, అకౌంటింగ్, ఖర్చుల పరిశీలన బృందాలను నియమించామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు ఓటర్లకు నగదు, కానుకలు, మద్యం పంపిణీ నివారణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని, ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతి అంశాన్ని వీడియో తీస్తున్నామని తెలిపారు. సమీక్షలో డీఎస్పీలు, నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

దక్కని గిట్టుబాటు..!

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ అర్బన్

ఆసియాలోనే మంచి పేరు కలిగిన ఆదిలాబాద్ పత్తి మార్కెట్‌పై అందరిలోనూ భారీ అంచనాలు ఉంటాయి. ఇక్కడ పండించే పత్తి మేలు రకం కావడంతో ఏ స్థాయిలో ధర ఉంటుందోనని ఆసక్తిగా గమనిస్తుంటారు. తాజాగా సోమవారం ఆదిలాబాద్ పత్తి మార్కెట్ ప్రారంభం అయినప్పటికీ.. తొలి రోజు రైతులకు దక్కిన ధరతో వారిలో ఏ మాత్రం సంతృప్తి కలుగలేదు. తొలిరోజున జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్దతు ధర రూ.7020తో ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోళ్లను ప్రారంభించింది. ప్రయివేటు వ్యాపారుల చెల్లించే ధర కోసం అందరూ ఆసక్తిగా తిలకించారు. ధర నిర్ణయ ప్రక్రియలో పాల్గొన్న వ్యాపారులు క్వింటాల్‌కు తొలుత రూ.6800 ధర నిర్ణయించారు. వేలంపాటలో ఒక్కో వ్యాపారి కేవలం రూ.10చొప్పున పెంచుతూ పోయారు. ఇలా రూ.10చొప్పున పెంచుతూ చివరకు రూ.7070వరకు వచ్చి ఆగిపోయింది. ఈ ధరతో రైతుల్లో తీవ్ర నిరాశ ఎదురుకావడంతో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని వ్యాపారులతో మాట్లాడారు. చివరకు తొలి రోజు వ్యాపారులు చెల్లించే ధరను క్వింటాల్‌కు రూ.7100కే పరిమితం చేశారు. అనంతరం అధికారికంగా కొనుగోళ్లను ప్రారంభించి మార్కెట్‌కు వచ్చిన పత్తి రైతులను సన్మానించారు.

భారీగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు..!

ప్రస్తుతం వ్యవసాయం చేయాలంటేనే రైతులకు భయపడాల్సిన పరిస్థితి వస్తోంది. మార్కెట్‌లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరగడంతో పాటు ప్రభుత్వాలు వీటిపై ఇచ్చే సబ్సిడీలు కూడా ఎత్తివేశాయి. దీంతో ఒక్క ఎకరంలో పత్తి పండించాలంటే కనీసం రూ.10వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. మరోపక్క కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర రూ.7020 కూడా రైతులకు ఏ మాత్రం ఆమోదయోగ్యంగా లేదు. ఈ ధర కంటే ఎక్కువ చెల్లిస్తారని రైతులు ప్రయివేటు వ్యాపారులపై నమ్మకం పెట్టుకున్నారు. కానీ మద్దతు ధరకు కేవలం రూ.80 మాత్రమే పెంచి చేతులెత్తేయడంతో పత్తి రైతులకు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రస్తుతం తొలి రోజున కేవలం 13 పత్తి వాహనాలు మాత్రమే వచ్చినా..మిగితా వేలాది మంది రైతులు మాత్రం మార్కెట్‌లో ధర కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం ఎకరానికి రూ.11వేల చొప్పున లభించినా వెంటనే మార్కెట్‌కు పత్తిని తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోపక్క ప్రభుత్వం నిర్ణయించిన తేమశాతం రైతులను మరింత నష్టం చేకూర్చేలా మారింది. ప్రస్తుతం సహజంగానే వాతావరణంలో మంచు ప్రభావం ఉండటంతో తొలి పత్తిలో సాధారణంగానే తేమ అధికంగా చూపిస్తుంటుంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం 8శాతం వరకు మాత్రమే మినహాయింపు ఇచ్చింది. ఇంతకుమించి ఒక్కశాతం అధికంగా చూపించినా కిలో చొప్పున పత్తిని ధరలో కోత విధిస్తున్నారు. ఏదేని ఒక రైతుకు 20శాతం తేమ చూపిస్తే క్వింటాల్‌కు కనీసం రూ.852 నుంచి రూ.వెయ్యి వరకు ధరలో కోత పడుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే కాలం కలిసి రాక పంటలు నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న తమకు తాజాగా మార్కెట్‌లో నిర్ణయించిన ధర మరింత నష్టాల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర పెంచి రైతులకు న్యాయం చేయాలి : బండి దత్తాత్రి, రైతు సంఘం నాయకుడు



ప్రస్తుతం పెరిగిన పెట్టుబడి ఖర్చులకు తాజాగా మార్కెట్‌లో నిర్ణయించిన ధర రైతులకు ఏ మాత్రం గిట్టుబాటు కాదు. ప్రభుత్వం శాస్త్రీయత లేకుండా క్వింటాల్‌కు కేవలం రూ.7020 మాత్రమే నిర్ణయించింది. మార్కెట్‌లో ఇంత కంటే అధికంగా ధర పలుకుతుందని ఆశపడిన రైతులకు స్వల్పంగా పెరగడంతో నిరాశే ఎదురైంది. కనీసం క్వింటాల్‌కు రూ.11వేల వరకు ధర పెంచడంతో పాటు తేమశాతాన్ని కనీసం 16వరకైనా పెంచితే రైతులకు కొంతైనా ప్రయోజనం చేకూరుతుంది.

మళ్లీ మొదలైన ఎన్‌హెచ్-63 సర్వే..!

(మొదటి పేజీ తరువాయి)

విన్నవించారు. టెంట్లు వేసుకొని నెలల తరబడి నిరసన తెలిపారు. దీంతో నాలుగు నెలల క్రితం సర్వే ఆగిపోయింది. ఇప్పుడు ఎన్నికల కోడ్‌తో బాధితులు ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేసే వీలు లేదు కాబట్టి సర్వే ఏజెన్సీ దూకుడు పెంచి లక్సెట్టిపేట్, హాజీపూర్ మండలాల్లో రోడ్డు పక్కన ఉన్న గృహాల సర్వే మొదలు పెట్టింది.

ఎల్లంపల్లి బాధితులకు తీరని గోస

ఎల్లంపల్లి నిర్మాణం కోసం ప్రాజెక్ట్ నిర్మితమైన గుడిపేట్, నంనూర్ గ్రామస్తులు వారి పంట భూములను, ఇండ్లను త్యాగం చేశారు. అప్పుడు ప్రభుత్వం ఇచ్చిన అతికొద్ది పరిహారంతో కొందరు గుడిపేట్ జాతీయ రహదారికి ఆనుకొని భూములు కొనుగోలు చేసి ఇండ్లు నిర్మించుకొని ఉపాధి కోసం వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అప్పుడు సర్వం కోల్పోయి ఐదారేండ్లుగా కొద్దిగా నిలదొక్కుకున్న సమయంలో ఇప్పుడు రోడ్డు వెడల్పు పేరుతో కట్టుకున్న ఇండ్లను, కొనుగోలు చేసిన భూములను తిరిగి కోల్పోవాల్సి వస్తోంది.

పోరాటానికి సిద్ధపడ్డ ఎల్లంపల్లి, ఎన్‌హెచ్-63 బాధితులు

జాతీయ రహదారి 63 అభివృద్ధి కోసం నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులకు ఎన్‌హెచ్‌ఎఐ నోటిఫికేషన్ విడుదల చేయడంతో బాధితులు పోరాటానికి సిద్ధపడ్డారు. తమ భూములను, ఇండ్లను ఇచ్చే ప్రసక్తే లేదని, దీని కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం అంటున్నారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఇండ్లు,



వ్యవసాయ భూములు త్యాగం చేశామని పేర్కొంటున్నారు. ఇప్పుడు జాతీయ రహదారి విస్తరణ పేరిట మరోసారి ఇండ్లు, భూములు తీసుకుంటామంటే ఒప్పుకునేది లేదని కరాఖండిగా చెబుతున్నారు. అసలు ప్రజాభిప్రాయ సేకరణ జరపనిదే ఎలా నోటిఫికేషన్ ఇస్తారని ఎన్‌హెచ్‌ఎఐ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ప్రభుత్వ విలువ ప్రకారం కాకుండా ఇప్పుడు నడుస్తున్న ధరల ప్రకారం నష్టపరిహారం మూడు రెట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీని కోసం గతంలోనే కలెక్టర్, జాతీయ రహదారుల అభివృద్ధి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కేంద్ర రహదారుల అభివృద్ధి శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కలిసి కూడా బాధలు చెప్పుకున్నారు.

సర్వే అడ్డుకుంటాం : కందుల రమేష్, ఎన్‌హెచ్ 63 బాధితుల సంఘం అధ్యక్షుడు



గతంలో పోరాటం చేస్తే సర్వే ఆగింది. మళ్లీ మొదలు పెడితే అడ్డుకుంటాం. ఎల్లంపల్లి నిర్మాణంలో వ్యవసాయ భూములు, ఇండ్లు కోల్పోయాం. జాతీయ రహదారి పక్కన ఇండ్లు నిర్మించుకొని, దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నాం. ఇప్పుడు జాతీయ రహదారి వెడల్పు పేరుతో మళ్లీ ఇండ్లను పూర్తిగా కోల్పోవాల్సి వస్తుంది. మరోసారి త్యాగం చేయడానికి సిద్ధంగా లేం. వేరే చోట ఇంటి నిర్మాణం కోసం స్థలం కేటాయించి, ఉపాధి చూపించాలి. మార్కెట్లో రూ.12 వేలకు చదరపు గజం ఉన్న ధరను చెల్లించాలి. ఇంటి నిర్మాణ ఖర్చు లెక్కేసి మూడు రెట్లు నష్టపరిహారం చెల్లించాలి.

ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలి

మందమర్రి: 18 సంవత్సరాలు నిండిన పౌరులందరూ ఓటరు లిస్టులో పేరు నమోదు చేసుకొని ఓటు హక్కుని తప్పని సరిగా వినియోగించుకోవాలని డిఆర్‌డిఓ స్వీప్ నోడల్ అధికారి శేషాద్రి సూచించారు. మందమర్రిలోని సింగరేణి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన పౌరులు అక్టోబర్ 31వరకు ఓటరు లిస్టులో పేరు నమోదు చేసుకోవాలన్నారు. డబ్బులకు, వస్తువులకు అమ్ముడుపోకుండా మంచి వ్యవస్థను, న్యాయమైన వ్యక్తులకు ఓటు వేయాలని కోరారు. జెడిఎంఆర్ వి రాంచందర్ ఓటు హక్కు, ఓటు విలువను విద్యార్థులకు వివరించారు. తెలంగాణ కళాజాతర బృందం ఓటు విలువను తెలిపే జానపద గీతాలతో అలరించారు.

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక

నిర్మల్

3

మంగళవారం అక్టోబర్ 31, 2023

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ఆలూరు గ్రామంలో సోమవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీఓ సరోజ, వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి, క్వింటాలకు మొదటి రకం రూ.2వేల 203, రెండో రకం రూ.2వేల 183 ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మల్లేష్, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న చేరికలు

నవతెలంగాణ-కడెం

మండలంలోని కొండుకూర్ గ్రామానికి చెందిన పీసు లచ్చిరెడ్డి, కళ్లెం రాజారెడ్డి, ఎండీ అశ్రాఫ్‌అలీ, సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ సమక్షంలో చేరారు. వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భూక్యా జాన్సన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేస్తూ, కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గురించి, వివరిస్తూ గెలుపు లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, నిర్మల్ జిల్లా జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫిక్ అహ్మద్, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు జీవన్‌రెడ్డి, మండల మాజీ ఎంపీపీ భూక్యా అమ్మి బాపూరావు, ఆధ్వర్యంలో మండలంలోని పాత మద్దిపడగ పోలింగ్ బూత్ పరిధిలోని వంద మందికి ఒక పోలింగ్ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు వేణుగోపాల్, కొండుకూర్ గ్రామకమిటీ అధ్యక్షులు కళ్లెం తిరుపతిరెడ్డి, సతీష్ రెడ్డి, సీనియర్ నాయకులు ముబారక్‌బిన్ మొహమ్మద్, గౌసోద్దీన్, పాత మద్దిపడగ ఉప సర్పంచ్ పంజాల రామగౌడ్, గ్రామ అధ్యక్షులు గద్దల దేవన్న, సోషల్ మీడియా మండల అధ్యక్షులు ఎండి హసీబ్, పార్టీ నాయకులు తాళ్లపల్లి రాజన్న, ఎండీ ఇస్మాయిల్, శ్రీనివాస్, నర్సయ్య, బైరి ప్రసాద్, గద్దల ఆనందం, గంగన్న, డి.వెంకన్న, బుగ్గరపు రమేష్, ఎండీ రజాక్, ఎండీ అక్బర్, ఎండీ వలి మొహమ్మద్, ఆకుల రమేష్, వెంకటేష్, దుర్గ మల్లేష్, ఆనంద్, పల్లె నాగన్న, పడాల చిన్నయ్య, పంజాల చంద్రశేఖర్, రాజేశం, రాకం రాజేశ్వర్, రాజన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా మేనిఫెస్టోను వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

2న రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

దళితులు, వ్యవసాయ కూలీల సమస్యలపై నవంబర్ 2న నిర్మల్‌లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాకూరి తిరుపతి, దుర్గం నూతన్ కుమార్ అన్నారు. సోమవారం ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దళిత హక్కుల పరిరక్షణ కోసం డిసెంబరు 4న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని వ్యవసాయ కార్మిక సంఘాలు, దళిత సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కోటి సంతకాలు సేకరణ చేసి రాష్ట్రపతికి ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సంతకాల సేకరణలో ప్రజలు దళితులు, కూలీలు విరివిగా సంతకాలు చేసి, దళిత సమస్యలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. దానిలో భాగంగానే నవంబర్ 2న నిర్మల్‌లో ప్రజాసంఘాల కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం, నవంబర్ 5న జిల్లా సదస్సును నిర్వహించనున్నామన్నారు. ప్రజా సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి తిమ్మాపురం ముత్తన్న, నిర్మల్ డివిజన్ నాయకులు బర్కుంట గంగారాం, జాదవ్ కిషన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే మరింత అభివృద్ధి



నవతెలంగాణ-సారంగాపూర్

నిర్మల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితోనే అభివృద్ధి చెందుతుందని పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు నల్ల వెంకట్‌రామ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దని, గోపాల్‌పేట్, సోనాపూర్ గ్రామాల్లో సమావేశం నిర్వహించి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్ రెడ్డి, సొసైటీ చైర్మెన్ నారాయణరెడ్డి, మాణిక్ రెడ్డి, ఎఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మెన్ రాజ్ మహమ్మద్, రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవ్‌రావు, సర్పంచులు రామారావ్, లస్మవ్వ, నాయకులు సాయి కృష్ణ, భూమేశ్, శ్రీనివాస్, సాయన్న పాల్గొన్నారు.

బుద్ధుని వైజ్ఞానిక మార్గమే జీవితానికి దిక్సూచి

- బీఎస్ఐ కేంద్రీయ ప్రభారీ బీఎం కాంబ్లే



కేంద్రీయ ప్రభారీ బీఎం కాంబ్లేను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

నవతెలంగాణ-ముధోల్

ప్రపంచానికి శాంతి అహింసాయుత మార్గాన్ని బోధించిన బుద్ధుని వైజ్ఞానిక మార్గమే ఉన్నతమైన జీవితానికి దిక్సూచి అని భారతీయ బౌద్ధ మహాసభ కేంద్రీయ ప్రభారీ బీఎం కాంబ్లే అన్నారు. సోమవారం మండల కేంద్రంలో భారతీయ బౌద్ధమహాసభ ఉత్తర తెలంగాణ సౌరక్షన్ విభాగ్ అధ్యక్షుడు నారాయణ వాగ్మారేను, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు వాగ్మారే ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని 18 దేశాలు భారతీయ మతమైన బౌద్ధాన్ని అనుసరించి సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఉన్నతమైన శిఖరాలకు చేరుకున్నాయని తెలిపారు. అదేవిధంగా సమాజంలో మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష వంటి అంశాలని పెంపొందించాలని సూచించారు. ముఖ్యంగా యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, ఉన్నతమైన ఆశయంతో ముందుకెళ్లి సమాజానికి ఉపయోగకరమైన పనుల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారతీయ బౌద్ధమహాసభ దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాల్లో విస్తృతంగా బుద్ధుని బోధనలను ప్రచారం చేయడంతో పాటు బహుజనులలో చైతన్యం తీసుకువస్తుందన్నారు. బహుజన సమాజం ఉన్నతి కేవలం విద్యతోనే సాధ్యమన్న విషయాన్ని మరవకూడదని అన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మైత్రి భావాన్ని పెంపొందించేందుకు తన వంతుగా కృషి చేయాలని వివరించారు. రాజ్యాంగ నిర్మాత తన ఐదు లక్షల అనుచరులతో కలిసి బౌద్ధ ధర్మ దీక్షను తీసుకోవడం చారిత్రాత్మక ఘట్టమని తెలిపారు. బహుజనులు మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ, విజ్ఞాన వంతమైన మార్గాన్ని అనుసరించినప్పుడే ఉన్నతి సాధ్యమని పేర్కొన్నారు. మేధావులు సమాజ హితం కోసం నిరంతరంగా పనిచేయాలని కోరారు. భారతీయ బౌద్ధమహసభ వివిధ రకాల శిబిరాలను తీసుకొని ప్రజలను చైతన్యవంతం చేయడానికి విశేషంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ఉపాసకులు డాక్టర్.గంగాధర్ మాద్నూరే, పురుషోత్తం వాగ్మారే పాల్గొన్నారు.

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వాహనం తనిఖీ

నవతెలంగాణ-నిర్మల్



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌లు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిర్మల్ నుంచి హైదరాబాద్ వెళుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వాహనాన్ని సోన్ చెక్‌పోస్టు వద్ద పోలీస్‌లు ఆపి తనిఖీ చేశారు. పోలీసులకు మంత్రి తనిఖీ కోసం సహకరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, రూ.50 వేలపైన నగదు ఉంటే సంబంధిత వివరాలు లేదా పత్రాలు ఉండాలని పోలీసులు సూచించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమంలో నిర్మల్ జిల్లాకు చెందిన ఆశా వర్కర్లు సోమవారం పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి మాట్లాడారు. ఆశా వర్కర్ల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ప్రకారం కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, ప్రధాన కార్యదర్శి గంగామణి, గౌరవ అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షురాలు భాగ్య, పద్మ, ఇంద్రమాల, సరిత, గోదావరి, సుగుణ, తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లాల ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు

అభివృద్ధిని చూసి ఆదరించండి

• బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి



నవతెలంగాణ-రెబ్బెన

అభివృద్ధిని చేసి ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఆదరించడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి కోరారు. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు కష్టపడి తనను గెలిపిస్తే ఐదేండ్ల పాటు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి అన్నారు. మండలకేంద్రంలో కేకే గార్డెన్‌లో ఆదివారం రాత్రి బీఆర్ఎస్ మండలస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి బీఆర్ఎస్ అభ్యర్థులను, బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని, మూడోసారి అధికారంలోకి తీసుకొస్తాయని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమల్లో దేశంలో అగ్రస్థానంలో నిలిచిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు, వికలాంగుల పింఛన్లు, రైతు రుణమాఫీ, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్టు, అదేవిధంగా మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటింటికి నల్లా మంచినీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 60 సంవత్సరాలపాటు పరిపాలన చేసిన పార్టీలు 60 సంవత్సరాల్లో చేసిన అభివృద్ధిని కేవలం 10 సంవత్సరాల్లో చేసిచూపిన ఘనత మన కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు, జడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కార్నాదం సంజీవ్‌కుమార్, వైస్ ఎంపీపీ గజ్జెల సత్యనారాయణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేష్‌గౌడ్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చెన్న సోమశేఖర్, రైతుబంధు సమితి జిల్లా సభ్యురాలు కుందారపు శంకరమ్మ, సర్పంచ్‌లు పోటు సుమలత, బొమ్మినేని అహల్యాదేవి, పందిర్ల వినోద, వడాయి మాధవి, ఎంపీటీసీలు సంఘం శ్రీనివాస్, పెసరి మధునయ్య పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్

నవతెలంగాణ-తాంసి

బోథ్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను కారుగుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సోమవారం మండలంలోని బండల్‌నాగపూర్, భీంపూర్ మండలంలోని కమట్‌వాడ, కొజ్జన్‌గూడ, గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు మండల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు నూతన మేనిఫెస్టోను ఓటర్లకు తెలియజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీలు సుధాకర్, రాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి అయిన అనిల్ జాదవ్ యువకులు అందరిని కలుపుకొని ముందుకు సాగే గుణం కలిగి వ్యక్తి అని అన్నారు మన మండలాలు మరింత అభివృద్ధి చెందాలంటే కారుగుర్తుకు ఓటు వేసి మన అభ్యర్థి అనిల్ జాదవ్ గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు అరుణ్, నాగయ్య, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సంతోష్, సంజీవ్‌రెడ్డి, లస్మన్న, అనీల్, దనుంజయ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతుల ద్వారా పత్తిలో అధిక దిగుబడులు

• కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కోట శివకృష్ణ



తెలంగాణ-తాండూర్

శాస్త్రీయ పద్ధతులను అవలంబించడం ద్వారా పత్తిలో అధిక దిగుబడును పెంపొందించుకోవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివరామకృష్ణ అన్నారు. సోమవారం బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం జాతీయ పత్తి పరిశోధన సంస్థ, నాగ్‌పూర్ వారు బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో నిర్వహించిన పత్తి క్షేత్ర దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. జాతీయ పత్తి పరిశోధనా సంస్థ, నాగ్‌పూర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రీయ పద్ధతుల ద్వారా పత్తి ఉత్పాదకతను పెంచేలా మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 187 ఎకరాలలో రైతు క్షేత్రాలలో ప్రదర్శనలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చంద్రవెల్లి గ్రామంలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుచేస్తున్న దుర్గం సుమన్ గారి క్షేత్రంలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించి సాగులో చేపట్టవలసిన సమగ్ర యాజమాన్య పద్ధతులపైన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. రైతులకు అనుభవాలను ప్రత్యక్షంగా చూపించటం ద్వారా వచ్చే వానాకాలంలో అధిక సాంద్రత పత్తి సాగు మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా తమిళనాడులోని జాతీయ పత్తి పరిశోధన సంస్థ సీనియర్ సైంటిస్ట్ డా.సంపత్ కుమార్, (ప్లాంట్ పాథాలజీ) మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగులో చేపట్టవలసిన పోషక యాజమాన్యంగురించి చీడ పీడల యాజమాన్యం పైన అవగాహనకల్పించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సురేఖ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, రాశి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఐలయ్య, సంతోష్, బెల్లంపల్లి మండల వ్యవసాయ విస్తరణ అధికారిని నాగదీప్తి, విస్తరణ అధికారి శ్రీనివాస్, కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి యంగ్ ప్రొఫెషనల్స్ డా. ప్రియాంక, భరత్ పాల్గొన్నారు.

నవంబర్ 6న చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్‌తో నవంబర్ 6 తేదీన నిర్వహించ తలపెట్టిన చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కోరారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు గత ఐదు నెలల నుంచి వేతనాలు రావడం లేదన్నారు. దీనితో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాల కోసం ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. వేతనాలు చెల్లించాలని డిమాండ్‌తో నవంబర్ 6వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో కలెక్టరేట్‌కు అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీకాంత్, నాయకులు మాట్ల రాజు, సమ్మయ్య పాల్గొన్నారు.

అవినీతి అభివృద్ధికి అడ్డంకి

• బెల్లంపల్లి ఏరియా జీఎం డి.రవిప్రసాద్

నవతెలంగాణ-రెబ్బెన

అవినీతి ఏ రంగంలోనైనా అభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని బెల్లంపల్లి ఏరియా జీఎం డి.రవిప్రసాద్ అన్నారు. సోమవారం జీఎం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులతో కలిసి అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి సమాజ పురోగతిని అడ్డుకుంటుందన్నారు. అవినీతి లేకుంటే అన్ని రంగాల్లో సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, డీజీఎం ఎఫ్అండ్ఎ రామారావు, డీజీఎం సివిల్ ఆర్ సతీష్‌బాబు పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

నవంబర్ 18న హైద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కొండ్ర బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి కంబాల రమేష్, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు జలంపెల్లి శ్రీనివాస్, పిట్టల సత్యనారాయణ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బన్న మూర్తి తదితరులు ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీలలోని 59 ఉపకులాలలను ఎబీసీడీలుగా వర్గీకరిచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని పేర్కొన్నారు. దీనిపై చర్చించి, భవిష్యత్తు పోరాటాన్ని నిర్ణయించేందుకు ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మరోసారి ఆశీర్వదించండి

• అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా
• ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప

నవతెలంగాణ-బెజ్జూర్

రెండుసార్లు తనను గెలిపించినందుకు నియోజకవర్గంలో అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదిస్తే పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తిచేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి కరెంట్ అందించామని, గిరిజనులకు పోడు పట్టాలను ఇచ్చామన్నారు. మరోసారి ప్రభుత్వం ఏర్పాటైతే గిరిజనేతరులకూ పోడు పట్టాలు అందజేస్తామన్నారు. తునికాకు రాయల్టీ ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతిఒక్క రైతుకు రుణమాఫీ అవుతుందని, దీనిపై రైతులు అధైర్యపడొద్దన్నారు. రూ.20కోట్లతో మండలానికి ఐదు చెక్‌డ్యాంలు మంజూరయ్యాయని, ఎన్నికల తర్వాత టెండర్లు పూర్తి చేస్తామని తెలిపారు. మాయమాటలు చెప్పి ప్రజల్లోకి వచ్చే నాయకులను నమ్మద్దని, ప్రజల్లో ఉండి పనిచేసే తనను దీవించాలని కోరారు. అనంతరం వ్యాపారవేత్త అమిరొద్దీన్ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గోల్కొండ మసీద్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు 100 మంది మైనార్టీలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాజొద్దీన్‌తో పాటు ఇప్పలగూడ, గెర్రెగూడ, అంబగట్ట తదితర గ్రామాలకు చెందిన మరో 100 మంది బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసి తనను గెలిపించే విధంగా కృషి చేయాలని కోనప్ప వారిని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు కోంద్ర జగ్గాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు డోకె వెంకన్న, బశరత్‌ఖాన్, సకారాం, రేణికుంట్ల పెంటయ్య, పుల్లూరి సతీష్, తంగడిపెల్లి మహేష్, జావీద్ అలీ, జావీద్, సర్పంచ్‌లు రేణికుంట్ల సంతోష్, బుజాడి శేఖర్, ఆలం అనిల్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

• కార్పొరేటర్లకు ఊడిగం చేస్తున్న మోడీ
• ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్
• ఏఐటీయూసీ 104వ దినోత్సవ వేడుకలు



వేడుకల్లో మాట్లాడుతున్న బోగె ఉపేందర్

నవతెలంగాణ-రెబ్బెన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. సోమవారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గోలేటి క్రాస్ రోడ్డులో సింగరేణి కోల్ ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏఐటీయూసీ అధ్యక్షుడు అరికిల్ల స్వామి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ 1920, అక్టోబర్ 31న ఏఐటీయూసీ దేశ వానిజ్య రాజధాని ముంబాయిలో ఆవిర్భవించడం జరిగిందన్నారు. దేశానికి పూర్తి ప్రశంసలు రావాలని బ్రిటీషు వారిపై ఎన్నో పోరాటాలు, తాగ్యాలు చేసింది ఏఐటీయూసీ మాత్రమేనన్నారు. కార్మికుల హక్కులను సాధించడంలో దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అన్నారు. నాటి నుండి నేటి వరకు 104 సంవత్సరాలుగా కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిన ఘనత ఏఐటీయూసీదే అన్నారు. కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యదావిధంగా కొనసాగించాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని, కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలని, జీఓ నెంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కోల్ ట్రాన్స్‌ఫోర్టు కార్మికులకు కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలని, కార్మికులందరికి ఈఎస్ఐ, పీఎఫ్, సీఎంపీఎఫ్, కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతినెల ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మోడీ ఎన్నికల్లో చెప్పినట్టు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోల్ ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్‌యూనియన్ ప్రధాన కార్యదర్శి గౌస్, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షుడు డి లచ్చన్న, రవిప్రసాద్ గౌడ్, జాయింట్ సెక్రటరీ కృష్ణ, కోశాధికారి సతీష్, నాయకులు బుచ్చన్న పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని దొంగచింత గ్రామ పంచాయతీ పరిధిలోని భీంజీ గూడ గ్రామానికి చెందిన ఆదివాసీ బాలిక హత్య కేసును చేదించి, దోషులను కఠినంగా శిక్షించాలని, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరి బాయి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలబాయి అన్నారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకొని, కుటుంబానికి భరోసా కల్పించారు. అనంతరం హత్యకు గురైన సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అంతకుముందు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌ను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ యువతులపై, మహిళలపై హత్యాచారం, హత్యలు జరగకుండా చూసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. నిందితులను పట్టుకొని వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం చూసుకోవాలన్నారు. దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను పట్టుకొని వారికి శిక్ష పడేలా చూస్తామని డీఎస్పీ తెలిపారు.


టీజీబీ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-నార్నూర్

టీజీబీ అందిస్తున్న సేవలు అభినందనీయమని మార్కెట్ కమిటీ సభ్యులు చింతవార్ రాజు అన్నారు. సోమవారం తాడిహత్నూర్‌లోని టీజీబీ బ్రాంచ్ మేనేజర్ ఆంబోతు శ్రీనివాస్ సిబ్బంది, బ్యాంక్ కస్టమర్‌లతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలోనీ 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మొదటి స్థానంలో వచ్చినందుకు ఈ వేడుకలను నిర్వహించుకున్నామని అన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది గణపతి, గంగూలీ, సీఎస్‌సీ నిర్వహకులు రవీందర్ ఫడ్, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం బతుకమ్మ నిమజ్జనాలు చేశారు. బతుకమ్మ వెళ్లి రావమ్మా అంటూ ఆటలు పాటలు పాడుతూ గ్రామ సమీపంలోని వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి, డప్పు చప్పుళ్ల మధ్య నీటిలో బతుకమ్మలను వదిలారు. ఈ సంబరాల్లో యువతులు, మహిళలు ఉత్సహంగా పాల్గొన్నారు.

నేడు జిల్లాకు కర్ణాటక ఎమ్మెల్సీ రాక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశం మంగళవారం తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ కమిటీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఏఐసీసీ పరిశీలకులు కర్ణాటక ఎమ్మెల్సీ రాథోడ్ ప్రకాష్ హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని తెలియజేశారు.

విద్యార్థులు రాక ఆశ్రమ పాఠశాలలు ఖాళీ

- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని వివిధ ఆశ్రమ పాఠశాలలతో పాటు సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు లేక వెలవెల బోతున్నాయి. గిరిజనుల పిల్లల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా జిల్లా వ్యాప్తంగా సుమారు 123 ఆశ్రమ పాఠశాలలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం దసరా పండగకు ఈనెల 25 వరకు సెలవులను ప్రకటించింది. సెలవులు పూర్తయి ఐదు రోజులు కావస్తున్నా పది శాతం విద్యార్థులు సైతం హాజరు కాక పోవడంతో ఆశ్రమ వసతి గృహాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలోని ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలో (బాలికలు)లో సోమవారం నవతెలంగాణ పరిశీలించగా మొత్తం 511 మంది విద్యార్థుల సంఖ్య ఉండగా, వారిలో 63 విద్యార్థులు పదో తరగతిలో చదువు తున్నారు. అయితే వీరిలో కేవలం ముగ్గురు విద్యార్థినులు మాత్రమే సోమవారం వరకు హాజరైనట్లు ప్రధానోపాధ్యాయులు కాతలే గంగారాం తెలిపారు. ఇదిలా ఉంటే మరో వారం రోజుల్లోపు దీపావళి దండారి సందడి ప్రారంభం అయ్యే



అవకాశముంది. ఈ లోపు విద్యార్థులు ఆశ్రమాలకు హాజరు కావాల్సివుంది. లేకుంటే పదో తరగతి విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు రావడం లేదు

తాము ఉపాధ్యాయ సిబ్బంది దసరా సెలవుల తరువాత ప్రతి రోజు నిరంతరంగా విధులకు హాజరవుతున్నాం. కానీ పండగలకు వెళ్లిన విద్యార్థులే రావడం లేదు. ఇదిలా ఉంటే ఎన్నికల వీధుల్లో ఉన్న ఉన్నతాదికారులు బీజీగా ఉండటంతో ఐటీడీఏ విద్యాశాఖ అధికారులు ఆశ్రమ వసతి గృహాలపై దృష్టి సారించక పోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైన ఐటీడీఏ ఉన్నతాధికారులు ఆశ్రమ పాఠశాలలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కాతలే గంగారాం
ప్రధానోపాధ్యాయుడు

ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాల అమలు

- ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-జైనథ్

దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మండలంలోని శ్రీలక్ష్మి నారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు చేసి, అదేవిధంగా దీపాయిగూడలోని 43అడుగుల హనుమాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, బీఆర్ఎస్ ప్రభుత్వం మేనిఫెస్టోను వివరించారు. కన్నతల్లి లాంటి కన్న ఊరు ఆశీర్వాదం తీసుకొని ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేనటువంటి సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తోందని అన్నారు. వాటి ఫలాలు ప్రజలందరికీ అందుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా లబ్ధిపొందుతున్నారని అన్నారు. రైతుబంధు, రైతుబీమా ఇలాంటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలవని అన్నారు. ఇంత మంచి ప్రభుత్వం మనదని అన్నారు. అందుకే మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసి మరిన్ని సంక్షేమ పథకాలను తమ హక్కుగా పొందాలని కోరారు. ప్రజలు ఎవరు కూడా



కాంగ్రెస్, బీజేపీ పార్టీల మోసపూరిత మాటలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రజలందరికీ అందరికీ తెలుసని అన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లవేళలా ముందంజలో ఉంటుందని అన్నారు. అన్నం పెట్టే రైతన్నకు సున్నం పెట్టే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మనకు అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మర్శెట్టి గోవర్ధన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ లింగారెడ్డి, విఠల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ వేణు యాదవ్, వైసీపీ సావాపురె విజయ్, సర్పంచులు పాల్గొన్నారు.

బాంబు స్క్వాడ్ పోలీసుల పనితీరుపై అవగాహన



విద్యార్థినులకు ఆయుధాల గురించి వివరిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా సోమవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసుల ద్వారా వినియోగించబడుతున్న వివిధ రకాలైన ఆయుధాలు, వాటి మందు గుండు సామాగ్రి, దేశ విదేశాలకు చెందినటువంటి అత్యాధునిక ఆయుధాలు, బాంబులు వాటి పనితీరు, తయారు చేసిన సంవత్సరం, తదితర అంశాలపై విద్యార్థులకు ప్రాథమికంగా కావాల్సిన అవగాహన కల్పించారు. అదేవిధంగా సాయుధ పోలీసు దళంలో బాంబు స్క్వాడ్ వారు వీఐపీ సందర్శన సమయంలో, రోడ్డుపై ఇరువైపులా వీఐపీ ప్రయాణించే దారి, రోడ్డుపై కల్వర్టులను, హెలికాప్టర్ నిలుపు ప్రదేశాలు లాంటి ప్రదేశాల్లో వినియోగించే పరికరాలు, డీప్ సర్చ్ మెటల్ డిటెక్టర్, నాన్ లినియర్ జంక్షన్ డిటెక్టర్, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్స్, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్స్ లాంటి పరికరాల పనితీరు ఉపయోగించే విధానాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాగ్ స్క్వాడ్ బృందం ఆదిలాబాద్‌లో ఉన్న వివిధ జాతులకు సంబంధించిన శునకాలు నిర్వర్తించే విధులు, పేలుడు పదార్థాలను, మందు పదార్థాలను, గంజాయి, నేరస్తులను వాసన పసిగట్టి గుర్తించే లక్షణం వివిధ రకాలైన ఉత్తమ ప్రదర్శనలను ఈ శునకాలు ప్రదర్శిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్లు నవీన్ కుమార్, టి.మురళి, అశోక్, రిజర్వు సిబ్బంది, బాంబు డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్ బృందం, ఆయుధాలను పర్యవేక్షించే బృందం సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం అక్టోబర్, 31 2023

ఎన్నికలయ్యేంత వరకు మద్యాన్ని అరికట్టాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యేంతవరకు మద్యాన్ని అరికట్టాలని ఆర్‌పీఐ సిర్పూరు అభ్యర్థి జాడి దీపక్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల కిరాణా దుకాణాలలో విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉందని, ఎన్నికల నేపథ్యంలో అధికారులు దాడులు నిర్వహించి చిన్న చిన్న దుకాణ యాజమానులపై కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. వీరిపై కాకుండా వీరికి మద్యం సరఫరా చేసే మద్యం దుకాణాల యాజమానులపై కేసు నమోదు చేసి, వారి లైసెన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

• ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నవంబర్ 30న జరగనున్న శాసనసభ నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఎస్పీ సురేష్ కుమార్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నేపథ్యంలో చేసే ప్రతి ఖర్చుకు సంబంధించి వివరాలను నమోదు చేయాలని తెలిపారు. నామినేషన్ నమోదు అయిన నాటినుండి నవంబర్ 30వ తేదీ పోలింగ్ జరిగే వరకు రాజకీయ పార్టీలు ఖర్చుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ప్రతి ఖర్చు వివరాలను అభ్యర్థుల ఏజెంట్లు కచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. వ్యయ పరిశీలకుల కమిటీ వద్ద ఉన్న ఖర్చుల వివరాలు, అభ్యర్థుల వద్ద ఉన్న కత్తుల వివరాలలో తేడాలు ఉండకూడదని, ఎన్నికల పరిశీలకులు రిజిస్టర్‌లను 3 సార్లు తనిఖీ చేయాలని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించు ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాల కొరకు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే అభ్యర్థులు బ్యాంకు ఖాతాలు తెరవాలని, హెలిపాడ్ కొరకు ముందస్తు అనుమతులు పొందాలని, ఎన్నికల ప్రశాంతంగా జరిగే విధంగా రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్ పాల్గొన్నారు.

పరిశోధన పత్రం అందజేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్



యోగా, ధ్యానం, వీటి యొక్క ప్రాముఖ్యతపై కాగజ్‌నగర్‌కు చెందిన సామల శ్రీవర్ధన్ పరిశోధించిన పరిశోధన పత్రాన్ని సోమవారం కరీంనగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భూపతి రజనీదేవికి అందించారు. ఈ సందర్భంగా రీసెర్చ్ స్కాలర్ శ్రీవర్ధన్ మాట్లాడుతూ రాజస్థాన్ మౌంట్‌అబూలోని ప్రముఖ అంతర్జాతీయ సంస్థ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఈ పరిశోధన పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో మానవుడు రోజువారీ జీవితంలో ఎన్నో ఒత్తిళ్లకు గురవుతున్నాడని, ఈ ఒత్తిళ్లను అధిగమించడానికి యోగా, ధ్యానం ఎంతో ఉపకరిస్తాయని తెలియచేసే విధంగా ఈ పరిశోధనను పూర్తి చేసినట్లు తెలిపారు. భవిష్యత్తు తరాల వారికి ఈ పరిశోధన ఎంతో ఉపకరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మరో రీసెర్చ్ స్కాలర్ అట్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన బుల్లాయి సంబరాలు

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహించిన బుల్లాయి సంబరాలు సోమవారం ముగిశాయి. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని వాడల్లో మహిళలు భాజాభజంత్రీలతో ఆటపాటలతో ఉత్సాహంగా సంబరాలను జరుపున్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అందరు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంబరాల్లో మహిళలు చిన్నాపెద్దా అనే తేడాలేకుండా ఆనందంగా పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బుల్లాయి మట్టి విగ్రహాలను స్థానిక వాగులో నిమజ్జనం చేశారు.

నాయకుల భవితవ్యం యువత చేతుల్లో

- జిల్లాలో 58 శాతం యువ ఓటర్లు
- 18-39 వయస్సు వారే కీలకం
- ఆకట్టుకునే ప్రయత్నంలో నాయకులు



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బొర్కాడే హేమంత్ (ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ఓటర్ల సమీకరణాలు చేయడం సాధారణంగా కనిపిస్తుంది. ఇప్పుడు ప్రతి చోట ఇది ట్రెండ్‌గా మారింది. నాయకులు మొత్తం ఓటర్లను మూడు గ్రూపులుగా విభజించి వృద్ధులు, మధ్య వయస్కులు, యువకులుగా విడదీసి తమ ప్రసంగాలలో కూడా వారికి ప్రాధాన్యం కనిపించడం చూస్తూ ఉన్నాం. జిల్లాలో 18 నుంచి 39 సంవత్సరాల వయసు గల యువకులే ఎక్కువగా ఓటర్లుగా ఉండడంతో ప్రస్తుతం నాయకుల చూపంత వారిపై పడింది.

జిల్లాలో వయసుల వారీగా ఓటర్ల వివరాలు

జిల్లాలోని 15 మండలాలతో పాటు ఆసిఫాబాద్ నియోజకవర్గంలోకి వచ్చే నార్నూర్, గాదిగూడ మండలాలను కలుపుకొని మొత్తం ఓటర్ల సంఖ్య 4,47,634 మంది ఉన్నారు. జిల్లాలో వయసుల వారిగా చూసినప్పుడు 18 నుండి 19 సంవత్సరాల వయసు గలవారు 16,550 మంది ఉండగా, 29 సంవత్సరాల వరకు 1,02,025 మంది, 39 సంవత్సరాల వరకు 1,21,257, 49 సంవత్సరాల వరకు 85,440, 59 సంవత్సరాల వరకు 62046, 69 సంవత్సరాల వరకు 37,217, 79 సంవత్సరాల వరకు 17,408, 80 సంవత్సరాల పైన 5,770 మంది ఓటర్లు ఉన్నారు.

నాయకుల భవితవ్యం యువత చేతుల్లో..

జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 4,47,634 మంది ఉండగా నియోజకవర్గాల వారీగా సిర్పూర్‌లో 2,22,973 మంది ఓటర్లు ఉండగా ఆసిఫాబాద్ లో 2,24,761 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 18 నుండి 39 సంవత్సరాల వయసున్నవారు 2,40,037 మందితో 58 శాతం కలిగి ఉన్నారు. నూతనంగా ఓటర్లుగా నమోదైన వారు 16,555మంది ఉన్నారు. ఓటర్ల శాతాన్ని ఆధారంగా చేసుకుంటే రానున్న ఎన్నికల్లో యువత చేతుల్లో నాయకుల భవితవ్యం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

యువతను ఆకట్టుకునే ప్రయత్నంలో నాయకులు

జిల్లాలో ఎక్కువ శాతం యువత ఓటర్లు ఉండడంతో నాయకులు కూడా వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే బీఎస్పీ అధినేత సిర్పూర్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీజేపీ అభ్యర్థి హరీష్ బాబులు అధికార పార్టీ యువతకు న్యాయం చేయలేదని విమర్శిస్తుండగా, అసిఫాబాద్‌లో ప్రచారం చేస్తున్న ప్రతిపక్ష నాయకులు శ్యామ్ నాయక్, సరస్వతి, గణేష్, ఆత్మారాం నాయక్ విజయ్‌లు బీఆర్ఎస్‌కు మరోసారి అవకాశం ఇస్తే నిరుద్యోగ యువత ఇంకా నష్టపోవాల్సి వస్తుందని ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా యువత ఎటువైపు నిలుస్తారనేది తెలియాలంటే నవంబర్ 30 వరకు ఆగాల్సిందే.

గ్యారెంటీ లేని కాంగ్రెస్.. నిలకడ లేని అభ్యర్థులు

• బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మీ, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

నవతెలంగాన-కెరమెరి

గ్యారంటీ లేని కాంగ్రెస్‌లో పూటకో మాట, పార్టీ మార్చే అభ్యర్థులు ఉన్నారని ఆసిఫాబాద్ జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవలే సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన బీఆర్ఎస్ మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలకు తెలంగాణ ప్రజల నుండి అద్భుతమైన స్పందన వస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ 6 గ్యారంటీలు అంటూ పూటకో మాట పూటకో పార్టీ మారుతూ తెలంగాణ ప్రజలను మాటలతో మరోసారి మోసం చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పూటకోపార్టీ మార్చే కాంగ్రెస్ నాయకులకే గ్యారెంటీ లేదన్నారు. ఇటీవల జరిగిన కర్ణాటక ఎన్నికల్లో అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చి, ఒక్క హామీ నెరవేర్చానని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి వాళ్ళను మోసం చేసి నాన్ లోకల్ అభ్యర్థికి టికెట్ ఇచ్చి కాంగ్రెస్ కార్యకర్తలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. నీళ్లు, నిధులు, నియమకాలు అనే నినాదంతో సీఎం కేసీఆర్, పోరాడి తెలంగాణను సాధించిన యోధుడు కేసీఆర్ అని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర నాయకుడి నుంచి ప్రతి గ్రామ కార్యకర్త బాధ్యత తీసుకోని ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణలో గుడిసె లేని ఇల్లు ఉండే విధంగా ప్రతి ఒక్క కుటుంబానికి గృహలక్ష్మీ పథకం ద్వారా ఇండ్లు కట్టుకునేలా బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి పక్షాలను నమ్మే పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు లేరన్నారు. అబద్దాలు చెప్తూ రాజకీయ స్థిరత్వం లేని నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పున:రుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ పెందూర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ కలాం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాథోడ్ ఉత్తం నాయక్, కెరమెరి ఎంపీటీసీ ఇఫ్తేకార్ అహ్మద్, సర్పంచులు నాణేశ్వర్, జగన్నాథ్ రావు, సోనీ బాయి, వాసుదేవ్ నారాయణ్, కావుడే తులసిరాం, మాజీ ఎంపీటీసీ గోగర్ల రాజయ్య, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్ లాల్, నాయకులు ఇనూస్, అంబాజీ, రఘునాథ్, రాంచందర్, జాయేద్ ఖాన్, లక్ష్మణ్, బాలాజీ, అరుణ్ పాల్గొన్నారు.



కోతుల బెడద తీర్చేందుకు చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో గత కొంతకాలంగా కోతులు, కుక్కలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పరిస్థితి గమనించిన డీఎల్పీఓ ఉమర్ హుస్సేన్, పంచాయతి కార్యదర్శి వంశీకృష్ణలు వాటిని పట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా నెల్లూరు నుంచి ప్రత్యేకంగా ఒక బృందాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత పది రోజులుగా జిల్లా కేంద్రంలోని కుక్కలను కోతులను మచ్చిక చేసుకుని వాటిని పట్టుకొని ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. జూబ్లీ మార్కెట్‌లో సోమవారం పెద్ద ఎత్తున కోతులను పట్టుకున్నారు. ఇప్పటివరకు 170 కుక్కలను 216 కోతులను పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. పట్టుకున్న వాటిని అడవిలో వదులుతున్నట్లు వివరించారు. మరో 10 రోజులపాటు కార్యక్రమం కొనసాగుతుందని, జిల్లా కేంద్రంలో కోతుల బెడద లేకుండా చేయడం లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. గత కొద్ది రోజులుగా కోతుల బెడద ఎక్కువ కావడంతో గ్రామస్తులు ఆందోళనకు గురి అవుతున్నామని ఫిర్యాదులు వచ్చాయన్నారు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి కోతులను పట్టుకోవడం గమనించిన పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు, పంచాయతీ అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

నవతెలంగాణ

మంచిర్యాల

మంగళవారం అక్టోబర్, 31, 2023

ఆరోగ్య కేంద్రంలో అన్నదానం



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లిలోని పోచమ్మగడ్డ వద్ద గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తిలక్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు, గర్భిణులకు అన్నదానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రతి సోమవారం అన్నదానం చేపడుతున్నామని దాత గెల్లి జయరామ్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు హాస్పిటల్ ఇన్చార్జి డాక్టర్ హనీష్, సమ్మయ్య, రత్నం రాజన్న, రంగ రామన్న, కంటేవాడ నాగేష్ కుమార్, వెంకట్ రాజాం పాల్గొన్నారు.

నగదు రహిత లాబాదేవీలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జైపూర్

నగదు రహిత లావాదేవీలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ జైపూర్ శాఖ మేనేజర్ ఈశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం కానుకూరు గ్రామంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌గౌడ్ అధ్యక్షతన గ్రామస్తులతో సమావేశమయ్యారు. వినియోగదారుల అవసరార్థం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా పొదుపు ఖాతాలతో పాటు వివిధ రకాలైన రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. పంటల రుణాలు, హౌసింగ్ లోన్ ఎడ్యుకేషన్, గోల్డ్ లోన్, రుణమాఫీలపై అవగాహన కల్పించారు. సామాజిక భద్రతగా ప్రధాన మంత్రి సురక్షణ, ప్రధాన మంత్రి జీవనజ్యోతి, అటల్ పెన్షన్ తదితర పథకాల ప్రయోజనాలు వివరించారు. ఆర్థిక అక్షరాస్యత ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కర్నూల్ కళాజాత బృందం సభ్యులు బ్యాంకు పథకాలపై ఆటపాట, మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పించారు.

చెన్నూర్ కాంగ్రెస్ టికెట్ మాదిగలకే కేటాయించాలి

నవతెలంగాణ-భీమారం

చెన్నూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ మాదిగలకే కేటాయించాలని ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గం ఏర్పడిన నుంచి 11 సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపు నుంచి కేవలం ఒక్కసారి మాత్రమే మాదిగ సామాజిక వర్గానికి కేటాయించారని గుర్తు చేశారు. కనుక తమ నియోజక వర్గం నుంచి ఆశిస్తున్న వారిలో ఈ సారి మాదిగ సామాజికానికే టికెట్ కేటాయించాలని కోరారు. తమది న్యాయమైన డిమాండ్‌గా భావించి కాంగ్రెస్ అధిష్టానం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జలంపెల్లి శ్రీనివాస్ మాదిగ, నియోజకవర్గం కోఆర్డినేటర్ మంత్రి మల్లేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల ఇన్‌ఛార్జీ గాలిపెల్లి సత్యనారాయణ మాదిగ, వెల్పుల సతీష్ మాదిగ, జిల్లా నాయకులు చకినరాపు మల్లేష్ పాల్గొన్నారు.

పరీక్షపై విద్యార్థులకు శిక్షణ



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో సీస్ స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్మెంట్ సర్వేపై నిర్వహించే పరీక్షపై కాసిపేట, తాండూర్ మండలాలకు సంబంధించిన పరీక్షా నిర్వాహణకు విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 3,6,9 తరగతుల విద్యార్థులకు నవంబర్ 3న విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలపై పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, పరీక్ష నిర్వహించేందుకు ఎంపికైన మోడల్ కళాశాల ఇంటర్ విద్యార్థులు అవగాహన పెంచుకొని పూర్తి స్థాయిలో పరీక్ష నిర్వహించాలని జిల్లా సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ మూర్తి వివరించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట, తాండూర్ మండలాల ఎంఈఓ వాసాల ప్రభాకర్, మండల నోడల్ అధికారి నెన్నెల లచ్చయ్య, మోడల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, మందమర్రి మోడల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి, సీసీఓ రాంబాబు, సీఆర్పీలు, ఇన్విజిలేటర్గా ఎంపికైన 61 మంది ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

గనులు, డిపార్ట్‌మెంట్లలో ఎన్నికల ప్రచారం నిషేధం

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్లలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిషేధమని మందమర్రి ఏరియా అధికార ప్రతినిధి పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ సర్క్యులర్ సీఆర్‌పీ/పీఈఆర్/ ఐ ఆర్/ డీ/98/1251 ప్రకారం రాష్ట్ర శాసనసభకు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సింగరేణి సంస్థలోని గనులు, విభాగాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు ఏ పార్టీ అభ్యర్థిని అనుమతించరాదని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఎన్నికల ప్రచారానికి ఉద్యోగులు హాజరైతే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే ఎన్నికల సంఘం అధికారులకు సమాచారం ఇస్తామని తెలిపారు.

బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నాయకుల చేరిక

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కిష్టాపూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గ్రామ ఉపసర్పంచ్ గాజుల మల్లేష్, పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. సోమవారం ఖానాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని సూచించారు.

ప్రధాన పార్టీల్లో అసమ్మతి గోల



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రధాన పార్టీ అభ్యర్థులకు అసమ్మతి గోల తలనొప్పిగా మారింది. అభ్యర్థులను ప్రకటించి రోజులు గడుస్తున్నప్పటికీ ప్రధాన పార్టీ అభ్యర్థులు ఆశావాహుల మధ్య సయోధ్య కుదరటం లేదు ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు అసమ్మతిని ఎదుర్కొంటున్నారు. నూతనంగా బీజేపీలోచేరి టికెట్టు దక్కించుకున్న శ్రీదేవి బీజేపీ సీనియర్ నాయకుల అసమ్మతిని ఎదుర్కొంటుంది. బీజేపీలో గత కొన్నాళ్లుగా నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తూన్న కొయ్యల ఏమాజీకి టికెట్ నిరాకరించడంతో తన అనుచరులతో నిరసనలు చేస్తున్నారు. నిరసనల్లో భాగంగా కాసిపేట మండలంలో రాస్తారోకో చేపట్టిన ఏమాజీ శ్రీదేవికి టికెట్టును రద్దు చేయాలని రాష్ట్ర కార్యాలయంలో తన అనుచరులతో నిరసన తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌లో ఆది నుంచి రెండు వర్గాలు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ టికెట్‌ను వినోద్‌కు కేటాయించడంతో ప్రేమ్‌సాగర్ రావు వర్గానికి చెందిన వర్గీయులు నిరసనలు తెలుపుతున్నారు. స్థానికేతరుడైన వినోద్‌కు మద్దతు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. అసమ్మతి వర్గీయులు రెండురోజుల కిందట ప్రత్యేకంగా లేదని అభ్యర్థిని మార్చాలని సమావేశమయ్యారు. బెల్లంపల్లి కాంగ్రెస్‌లో ప్రేమ్ సాగర్ వర్గానికి పటిష్టమైన నాయకత్వం ఉంది. ప్రేమ్ సాగర్ వర్గాల నుంచి యువకుడైన నాతారి స్వామి కాంగ్రెస్ టికెట్ ఆశించి బంగపడ్డారు. వినోద్ టికెట్ రద్దు చేయాలని స్వామి తన అనుచరులతో నిరసనలు తెలుపుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య సైతం అసమ్మతిని ఎదుర్కొంటున్నారు. కాసిపేట మండలానికి చెందిన వైస్ ఎంపీపీ జడ్పీటీసీ సింగల్ విండో చైర్మన్లు ఎంపీటీసీలతో కలిసి కాంగ్రెస్‌లోకి వెళ్లే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. తాండూరు మండలంలో మాజీ మండల అధ్యక్షుడు ఎంపీటీసీ సిరంగి శంకర్ తన అనుచరులతో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సిరంగి శంకర్ వర్గంలో మాసాడి తెలుగు డైరెక్టర్ మాసాడి తిరుపతి మార్కెట్ డైరెక్టర్ స్థానిక నాయకులు ఉన్నారు.

సంస్థలోని అక్రమాలపై ఫిర్యాదు చేయాలి

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి సంస్థలోని అక్రమాలను నిఘా అధికారులకు ఫిర్యాదు చేయాలని మందమర్రి జీఎం మనోహర్ కార్మికులకు సూచించారు. సింగరేణి విజిలెన్స్ అవగాహన వారోత్సవాల కార్యక్రమాన్ని సోమవారం మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశానుసారం 1987 సంవత్సరం సింగరేణి కంపెనీలో విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేసారని అన్నారు. చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ శ్రీధర్ ఐఏఎస్ ఆధ్వర్యంలో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 5వ తేది వరకు వారం రోజుల పాటు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులందరినీ అవినీతికి వ్యతిరేకంగా చైతన్యపరిచి అవినీతి నిర్మూలనలో భాగస్వాములను చేయడమే విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సంస్థలో అక్రమాలు జరుగుతున్నాయని గమనించినచో నిఘా అధికారులకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని, దేశ ప్రగతికి అవరోధం అయిన అవినీతిని నిరోధించు బాధ్యత ఏ కొద్ది మంది మీదనో వదిలివేయకుండా, ప్రతి ఉద్యోగి అవినీతి వలన దేశానికి సంస్థలకు జరిగే నష్టాన్ని గుర్తించి అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడినప్పుడే అవినీతిని నిర్మూలించవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సింగరేణి ఉద్యోగులకు అధికారులకు సింగరేణి స్కూల్‌లోని విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఐఈడీ డీజీఎం రాజన్న, ఎస్టేట్ అధికారి కుమారస్వామి, ఎన్విరాన్మెంట్ అధికారి ప్రభాకర్, ఐటీ ప్రోగ్రామర్ రవి, డీవై పీఎం ఆసిఫ్ పాల్గొన్నారు.

పార్టీ గెలుపుకు కృషి చేయాలి

నవతెలంగాణ-తాండూర్

కష్టపడి పార్టీ గెలుపుకు కృషి చేసిన వారికి బీఆర్ఎస్‌లో సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సోమవారం ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు రౌతు వెంకటేశం ఎమ్మెల్యే చిన్నయ్యకు మద్దతు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఆశయాలకు కట్టుబడి పని చేసిన నాయకులకు కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల్లోని బూత్ స్థాయి కార్యకర్తలు పంచాయితీ స్థాయి నాయకులు కలిసికట్టుగా కషిచేయాలన్నారు. బీఆర్ఎస్ మెనీపెస్టులో రూపొందించిన అంశాలను ప్రజలకు విడమర్చి చెప్పాలని తెలిపారు. ముఖ్యంగా బీఆర్ఎస్ గెలిస్తే మహిళలకు జీవన భృతి, రూ.400 కే గ్యాస్ సామాన్యులకు అందరికీ బీమా సౌకర్యాలను అందజేసే విషయాలను తెలియజేయాలన్నారు. మండలంలోని వివిధ గ్రామపంచాయతీలకు చెందిన ఉప సర్పంచ్‌లు



అద్వాల సత్యనారాయణ, పుర్ర శేఖర్, గుమాస శ్రీనివాస్, గుమ్మడి మలేష్, చర్ల రాజేశం, గున్నాల శేఖర్, మండగ కౌశల్య, నరిగె రాజయ్య, మడావి పరపత్‌రావ్, బైరి రాజ కుమార్ మద్దతు తెలిపారు.

సమిష్టిగా కృషి చేస్తే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం

నవతెలంగాణ-జన్నారం

నాయకులు, కార్యకర్తలు అంతా కలిసి మెలిసి పనిచేసి మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను తెలుపాలన్నారు. కెసిఆర్ చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అడగాలన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్తు, రైతుబంధు, రైతు బీమా తదితర సంక్షేమ పథకాలను స్పష్టంగా వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యులు మున్వార్ అలీఖాన్, పిఎసిఎస్ చైర్మన్ శీలం రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీపతి బుచ్చన్న, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, యూత్ అధ్యక్షులు పేరం శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఫజల్‌ఖాన్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

దేశంలోనే ఆదిలాబాద్ పత్తికి ప్రత్యేక గుర్తింపు



నవతెలంగాణ-ఆదిలాబాద్అర్బన్

దేశంలోనే ఆదిలాబాద్ పత్తికి ప్రత్యేక గుర్తింపు ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆయన పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ముందుగా పత్తి వేలంపాటలో రైతులు, ట్రేడర్లు, అధికారులు పాల్గొని, మద్దతు ధర రూ.7వేల 20గా నిర్ణయించారు. అనంతరం కలెక్టర్ కాంటకు పూజలు నిర్వహించి, రైతులను సన్మానించి తూకం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించే పత్తి నాణ్యమైనదని, దేశంలోనే మన జిల్లా పత్తికి ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా తేమ అధికంగా ఉంటుందని, 8 నుంచి 12 శాతం తేమతో ట్రేడర్లు రూ.7వేల 100వరకు కొనుగోలుకు ముందుకు వచ్చారన్నారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశామని, మార్కెట్, రెవెన్యూ సిబ్బంది నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, రైతు సంఘాల నాయకులు, ట్రేడర్లు, రైతులు పాల్గొన్నారు.

బోథ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మార్చాలని ర్యాలీ

నవతెలంగాణ-ఇచ్చోడ

బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆశావాహ అభ్యర్థులు నరేష్ జాదవ్, ఆడే గజేందర్ మాట్లాడుతూ ఏఐసీసీ పెద్దలు, పీసీసీ పెద్దలు నియోజకవర్గానికి వచ్చి ఈ ప్రాంత కార్యకర్తలతో సమావేశం నిర్వహించి అభ్యర్థిని ఎన్నుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఎన్నుకున్న అభ్యర్థిని అలాగే బరిలో ఉంచితే ఓటమి తప్పదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన డిజిటల్ సభ్యత్వ నమోదులో కానీ, రాష్ట్ర పార్టీ పిలుపులు, ఏఐసీసీ కార్యక్రమాలను తూచా తప్పకుండా అమలు చేసిన మాకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న అభ్యర్థి నియోజకవర్గంపై అవగాహన లేకుండా ఉన్నాడని తెలిపారు. పార్టీకి పనిచేసిన, అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకున్న వారిలో ఆదివాసీ (గోండు), లంబాడాలకు ఎవరికి అవకాశం ఇచ్చిన కలిసికట్టుగా పని చేసుకుని కాంగ్రెస్ పార్టీ జెండాను 40 సంవత్సరాల తర్వాత ఈ నియోజకవర్గంలో ఎగరవేసి పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి, సీఎల్పీ నేత బట్టి విక్రమార్కకి సోనియమ్మకు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి ప్రఫుల్‌రెడ్డి, ఇచ్చోడ బ్లాక్ అధ్యక్షులు మహిమూద్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కొత్తూరు లక్ష్మణ్, బీసీ సెల్



నియోజకవర్గ అధ్యక్షులు భోజన్న, మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు ముస్తఫా, మండల పార్టీ అధ్యక్షులు కళ్లెం నారాయణరెడ్డి, గుడిహత్నూర్ మండల అధ్యక్షులు నారాయణ కరుణాకర్, సిరికొండ మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, బోథ్ మండల అధ్యక్షులు కుర్మే మహేందర్, నేరడిగొండ మండల అధ్యక్షులు ఆడే వసంత్, బజార్‌హత్నూర్ మండల అధ్యక్షులు, తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, ప్రధాన కార్యదర్శి భత్తుల రమేష్, సోషల్ మీడియా నియోజకవర్గ అధ్యక్షులు విశ్వభోధి గైక్వాడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ నాగనాతప్ప, రషీద్, ఆసిఫ్, సిరికొండ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు నవీన్ కుమార్, జిల్లా నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



నవతెలంగాణ-తలమడుగు

బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని గడపగడపకు ప్రచారం నిర్వహించి, బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని తెలిపారు. దళిత బంధు, దళితబంధు, ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సంక్షేమ పథకాలతో పాటు వివిధ రకాల పింఛన్లు మంజూరు చేశారని అన్నారు. ప్రజలు కారుగుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రామాల్లో గ్రామస్తులు, యువకులు వివిధ సమస్యలు ముందుకు తీసుకువచ్చారని అన్నారు. ఎన్నికల కోడ్ దృశ్య శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయకూడదని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన వెంటనే సమస్యలు తీరుస్తానన్నాడు. ఝరి, పునాగూడ, ఉమ్రి, దేగాం, పల్సి(బి), పల్సి(బి) తండ, గ్రామాల ప్రజలు స్వాగతం పలికారు. ఈ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నగేష్, నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ చంటి, వెంకటేష్, కిరణ్ కుమార్, అబ్బుల్లా, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, అభిరామిరెడ్డి, మాధవరావు, జీవన్‌రెడ్డి, ఎల్మా శ్రీనివాస్‌రెడ్డి, రమాకాంత్, పాండు, జనక్ పటేల్, వనమాల, గోపాల్, ప్రభాకర్, చంద్రకాంత్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుంటున్నారు'

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుంటున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రావి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రెండు సార్లు ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చలేదన్నారు. నియోజకవర్గ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 20 సంవత్సరాలుగా ప్రాజెక్టులు పూర్తి చేయలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు జరిగిందేమీలేదని, ప్రజలు కష్టాలు పడుతున్నారని, ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు పెంచుతూ పేదవారి నడ్డివిరుస్తున్నాయన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ కార్డులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నామని, ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొయిరె బండు, నాయకులు గణపురం బాపూజీ, రమేష్, చంద్రు, లచ్చన్న పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉట్నూర్ మండలం దొంగచింత గ్రామపంచాయతీ పరిధిలో ఆదివాసీ అమ్మాయిపై అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలు, బాలికలపై రోజు రోజు ఇలాంటి దాడులు హత్యలు పెరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. వెంటనే దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చాందా(టి) దర్గాలో ప్రత్యేక పూజలు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందలోని హజ్రత్ సయ్యద్ సిరాజ్ ఉద్దీన్ రాజంషావలి దర్గాను సోమవారం ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేసి, చాదర్‌ను సమర్పించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను గెలిచే విధంగా ఆశీర్వదించాలని, ఆదిలాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా మత పెద్దలు మహమ్మద్ మక్బుల్ హైమ్మద్, రషీద్ ఖాన్, ఆసిఫ్ భాయ్, యాకుబ్ బాయ్, జిల్లా మైనారిటీ విభాగం నాయకులు ఎంఏ షకీల్, జిల్లా కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్, జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ విభాగం చైర్మెన్ సేడ్మకి ఆనంద్‌రావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేర కృష్ణారెడ్డి, మైనారిటీ సెల్ నాయకులు సుజాత్ అలీ, మన్సూర్ అలీ ఖాన్, అజ్మత్ ఖాన్ పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసుల ఫ్లాగ్ మార్చ్



నవతెలంగాణ-ఉట్నూర్

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ముందస్తుగా మండల కేంద్రంలో ప్రత్యేక బలగాలతో మార్చ్ ఫ్లాగ్ నిర్వహించామని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో పాత బస్టాండ్ నుంచి ప్రారంభమైన మార్చ్ అంగడి బజార్, ఐబీ చౌక్, ఎన్టీఆర్‌చౌక్, ఐటీడీఏ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేందర్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎన్నికలు నిర్వహణ ప్రశాంతంగా కొనసాగడానికి పోలీసుల మార్చ్ చేపడుతున్నామన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో బీఎస్ఎఫ్ బలగాలు, జిల్లా సాయుధ పోలీసులు, లోకల్ పోలీసులతో సుమారు 150 మంది వరకు ఈ ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సంజయ్ కుమార్, ఉట్నూర్, నార్నూర్ సీఐలు రామకృష్ణ, ప్రేమ్‌కుమార్, ఉట్నూర్ ఎస్సై మనోహర్ ఉన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మెస్రం భాస్కర్ ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలు హైదరాబాద్‌లో హిమాయత్ నగర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ మహాసభల సందర్భంగా జిల్లా నుంచి ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెస్రం భాస్కర్‌ను రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న యువజన సమస్యలు, విద్యార్థి నిరుద్యోగ సమస్యలపై, అనునిత్యం పోరాడుతామని తెలిపారు. గతంలో విద్యారంగ సమస్యలపై పది సంవత్సరాలకుపైగా పోరాటం చేసి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. రాష్ట్ర కమిటీలో చోటు దక్కడంతో తన ఎన్నికకు సహకరించిన యువజన సంఘం రాష్ట్ర కమిటీకి, జిల్లా నాయకత్వానికి భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు.